# ఈ రోజు పనిమనిషి రాలేదు

ఈరోజు పనిమనిషి రాలేదు. ఇంత పొద్దెక్కింది. ఇంకేమొస్తుంది? అని సుజాత మనసులో బాధపడింది. ఆబాధ పెద్దదై మనసు విలవిల లాడింది. తొమ్మిదయేటప్పటికి, పిల్లలకు టిఫెన్ బాక్సులు రెడీ చెయ్యాలి. శ్రీవారికి రుచిగా వండి పెట్టాలి. ఇంట్లో ఏపనికీ, ఎవరూ సాయం చెయ్యరు. వేళకి అన్నీ అమర్చకపోతే, నానా రభసాను.

అసలు పనిమనిషి రానిరోజున ఒక్క సుజాతకేమిటి? ప్రతీ ఇల్లాలికీ ఇబ్బందేను. మరి ఏంచేస్తాం చేతికి సాయంగా ఉంటుందనేగా, ఈ కరువు రోజుల్లో డబ్బులిచ్చి పెట్టుకొంటేను, నెలకి వారం రోజులు నాగాలు పెడుతుంది, ఎందుకు రాలేదు అని అడిగితే, ఏవో కారణాలు చెపుతుంది. గట్టిగా అడగాలనుకుంటుంది సుజాత. కాని మనసులో కొంచెం భయం మళ్ళీ మర్నాడు రాదేమోనని.

ఇల్లాలికి పనిమనిషి రాకపోవడంతో అనేక సమస్యలు. పనిమనిషి రాకపోవడంతో రణగొణ ధ్వని రావణాసురుడి పెళ్ళి అంత హడావిడి.

మన సుజాతలాంటి మెత్తని మనసున్న వారైతే కళ్ళనీళ్ళపర్యంతం అయిపోతారు.

మరో కోవకి చెందిన వారు అయితే, పనిమనిషి రాకపోతే నాకేం భయం లేదు, అంటూ ఇల్లంతా బొంగరంలా తిరుగుతూ, పిల్లలకీ, మొగుడుకీ తలోపని పురమాయించి, అవసరం అయితే ఆ పనిమనిషిని, మాన్పించి మరో పనిమనిషిని పెట్టుకోగలరు.

ఇంకొక మనస్తత్వం గల ఇల్లాలైతే, రణరంగంలోకి, దూకిన సత్యభామలా, పమిటని బొడ్డులో దోపుకుని, పనులన్నీ ఒక్క చేతిమీద చెయ్యగలదు. భర్తను, పిల్లలను నోరు ఎత్తకుండా, మెప్పించగలదు. ఇటువంటి వారు ధైర్యే సాహసే లక్ష్మి అని ఇంటాబైటా, తమ అదుపు ఆజ్ఞల్లో పెట్టుకుని, హాయిగా బ్రతికేయగలరు. మరో పనిమనిషిని పిలిచి, అన్నమో డబ్బులో ఇచ్చి ఇన్ని మాయకబుర్లు చెప్పి ముప్పు గడుపుకోగలరు. భర్తగారు ఏదైనా అధికారం చూపబోతే, నేనూ ఉద్యోగం చేస్తున్నాను, అని చెప్పి దర్జాగా మాట్లాడగలరు.

ఇంక ఎటొచ్చి సుజాత లాంటి మనస్తత్వం గల వారిదే సమస్య అల్లాను.

పనిమనిషి రాని రోజున అశోకవనంలో సీతలాగా, దిగులుగా అయిపోయి పెరట్లోకి

వెళ్ళి గంపెడు అంట్లగిన్నెల కేసి ఓసారి దిగాలుగా చూసి, ఎవరేనా పక్కవాళ్ళ పనిమనిషి కనిపిస్తుందేమోనని వీధిలోకి వెళ్ళి అటూ ఇటూ తిరగడం వల్ల పొద్దెక్కిపోయి ఇటు గిన్నెలూ కడగలేదు, అటు వంటపనీ కాక నానా హైరాణా పడిపోతుంది పాపం.

"అమ్మా నాకు స్కూలు టైము అయిపోతోంది. బాక్సు రెడీగా ఉందా? టిఫిన్ ఏదీ?" అంటూ పిల్లలు టేబుల్ దగ్గరకు వచ్చి కేకలు.

ఇంక భర్తగారు తన పాలిటి కర్తగారు, "ఏం ఏం చేస్తున్నావ్? పనిమనిషి రాకపోతే అంత దిగులు ఎందుకు? మా చిన్నప్పుడు, మా అమ్మ పదిమంది పిల్లలతో చేసుకునేది. తెల్లవారగట్ల లేచేది. అసలు ఆవిడ ఎప్పుడు పడుకునేదో - ఎప్పుడు లేచేదో మాకు తెలియదు. మేం లేచేటప్పటికి తలారా స్నానం చేసి, పూజా మందిరంలో కలకల లాడుతూ దీపాలు పెట్టేది. ఇప్పటి వాళ్ళు మొగుడుతో సమానంగా లేస్తారు." అని మాటలతో ఓ చురక వేస్తాడు సుజాతని.

మనసు గిలగిలా కొట్టుకుంటుందే కాని సమాధానం, చెప్పలేదు.

"మగవాళ్ళతో సమానంగా ఉద్యోగం చేస్తున్నాం, ఇంట్లో ఉండే ఇల్లాళ్ళు ఆనాడూ, ఈనాడూ సుఖపడ్డట్టు మేము ఏం సుఖపడుతున్నాం?" అందామనుకుంది సుజాత. కాని భయం వల్ల మనసులోనే అనుకుంది.

సుజాత, చిన్నప్పుడు బామ్మ ముద్దుపెట్టుకుంటూ"సుజాతా పేరులోనే ఉంది నీ అదృష్టం అంతాను" అనేది. ఏం బామ్మలో ఏం ప్రేమలో అని వేదాంత ధోరణిలో అనుకుంది మనసులోనే. పైకి అనడానికి భయంకదా మరి. ఈ భయపడే మనస్తత్వం ఉంది చూసారూ! ఇలా సీతమ్మవారికోవకి చెందిన వారిని పెంచిన తల్లితండ్రులు ఉన్నారు చూసారా? వాళ్ళదీ తప్పంతాను.

ఎందుకంటారా? "అమ్మా వినయమే భూషణం. ఆడపిల్లకి భూదేవికి ఉన్నంత ఓర్పు ఉండాలి. ఎవరేనా నీకు వ్యతిరేకంగా మాటాడితే, మౌనంగా ఊరుకోవాలి. ఊరుకొన్నవారికి ఊరెల్లనోపదు అన్నారు." అంటూ మన సుజాతని పెంచినట్లు, ముగ్ధత్వంగా తయారు చేస్తారు. దాంతో, అనేక సమస్యలు, అందులో పనిమనిషి రాని రోజు మరో సమస్య.

అసలు మన సుజాత మనసే వెన్నకంటే మృదువైనది కదా, పనిమనిషి రాని రోజున ఒక సమస్య అయితే, వచ్చిన రోజున, మరో ఇబ్బంది కలిగేది.

పనిమనిషి వస్తూనే నీరసంగా గొంతుపెట్టి "నిన్నటిలా లేదు. ఒకటే తల నొప్పిగా ఉంది. అయినా మీ మీద జాలికొద్దీ వచ్చాను" అంటుంది.

వెంటనే సుజాత మనసు కరిగిపోయి జాలిగా "అల్లాగా పాపం ఉండు! తలనెప్పి మాత్ర తెస్తాను" అంటూ, కాఫీగ్లాసుతో ప్రత్యక్షం అయి, "ఇవి తీసుకో అమ్మా. ఎవరేనా బాధపడుతూంటే చూడలేను" అంటూ, అది గిన్నెలు కడిగినంతసేపూ దాని దగ్గర కూచుని, జాలి పడుతుంది.

"ఓ వంద రూపాయలు అర్జంటుగా కావాలి. నెలాఖరున జీతంలో కట్టుకుందురుగాని మిమ్మల్నే ఊరికే ఇమ్మనలేదు. అల్లాచూస్తారేం?" అని సుజాతని డబాయించి పుచ్చుకొంటుంది. "అసలు మాననండి ఏదో కారణం ఉంటేనే కాని" అంటుంది. పైగా ఒక సంగతి చెప్పింది, "మాటి, మాటికీ పనిమనిషి అనకండి నాపేరు నరసమ్మ తెలుసా?"

మన సుజాత "తప్పకుండా ఇస్తాను, మేము ఉన్నదెందుకు నీ అవసరానికి ఆదుకోవడానికేగా" అందామనుకుంటుంది. పైకి అనలేదు. అంటే మరునాడు మానేస్తుందేమోనని. ప్రేమగా చూస్తూ చిరునవ్వు చిందిస్తూ వంద రూపాయలు అందిస్తుంది. అందువల్లే తరుచు పనిమనిషి మానేయడం నేర్చుకుంది.

ఈరోజున పనిమనిషి రాకపోవడంవల్ల అనేక ఆలోచనలు వచ్చాయి.

"ఏం కష్టమొచ్చిందో ఏమో పాపం! దాని బాధలు దానికి ఉంటాయి కదా?" అది చెప్పిన సంగతులు జ్ఞాపకం రాసాగాయి.

"అసలు నేచెప్పేది వినండి అమ్మా, నా మొగుడు రిక్షా లాగుతాడు. ఈరోజు ఈ కొద్ది రూకలేవచ్చాయి. ఏం వండుతావో ఏమో! అంటూ పది రూపాయలు నా మొఖాన కొడతాడు. వాడి దగ్గర మస్తుగ డబ్బులుంటాయి, తాగి తగలేస్తాడు. దాంతో నాకిచ్చిన రూకలు చాలక పిల్లలూ నేనూ కష్టపడుతున్నాం. చదువుకోరా బిడ్డా అంటే, అమ్మా నీ కష్టం చూడలేకున్నాం అంటారు. వాళ్ళు చదువుకుని, కుర్చీలో కూర్చుని ఉద్యోగం చేస్తే చూడాలని నా ఆశ, తప్పంటారామ్మా" అంటుంది.

"నీలాంటి అమ్మ జాలిపడి ఓ చీర ఇస్తుంది. మిగిలితే ఇదివరకు పెట్టేవారు, ఇప్పుడు చద్ది అన్నాలు పెట్టి, అదే ఫ్రిజ్జిలంటారు కదా? దాంట్లో దాచుకుతింటున్నారు. అహా మీలాంటి వార్ని అనకూడదు తప్పు. అసలు చెపుతున్నాను. తల్లి ప్రేమ కదా పిల్లల్ని

చదివించాలనీ! అమ్మా! మొన్ననో సినీమా చూసాను. అసలు ఆడపుట్టుక పుట్టకూడదనిపించేసింది. చిన్నప్పుడు తల్లితండ్రుల ఇష్టం, తర్వాత మొగుడు, ఆ తర్వాత, పిల్లలూ చెప్పినట్లు బ్రతుకుంది అని తెలిసింది. ఆ సినీమా చూసాక మీ చదువుకున్న అమ్మలకు మాత్రం, ఇబ్బందులు పడే అమ్మలు లేరంటారా?'' అంది.

నారమ్మ చెప్పినవన్నీ జ్ఞాపకం వచ్చాయి గిన్నెలు తోముకుంటున్నంతసేపూను.

భోంచేసి లేస్తూ "ఇవాళ పనిమనిషి రాలేనట్టుంది'' అన్నాడు సుజాత భర్త.

"అవును పొద్దుటినుంచీ, చూస్తూనే ఉన్నారుకదా? మళ్ళీ అడగడం దేనికి, ఏమీ, ఎరగనట్టుగా, అడుగుతున్నారు?'' అందామనుకుంది. కాని మనసులో ఆగిపోయాయి ఆ మాటలు.

"గాంధీగారేమన్నారు ఎవరి పనులు వాళ్ళు చేసుకోవాలి, ఒకరి మీద ఆధారపడకూడదు. అని చెప్పారు వినలేదా? ఎప్పుడూను'' చిరునవ్వు చిందిస్తూ అన్నాడు.

ఆ మాటలు వినేసరికి, కోపం చిర్రెత్తుకువచ్చింది భర్త మీద. కోపంగా, భర్తకేసి చూస్తూను ముఖం పక్కకి తిప్పుకుంది.

"మీ మాటల్లోనే, మీరు కూడా ఇంటి బాధ్యత తీసుకోవాలని అర్థం ఉంది'' అనుకుంది.

అసలు ఈరోజు పనిమనిషి రాకపోవడం వల్ల పని ఎక్కువై అందరి మీద కోపం వస్తోంది సుజాతకి.అశక్తులు కోపం మనసులోనే దిగమింగుకుంటారు కదా?

"ఇంగ్లీషు వాళ్ళలా భర్తతో సమానంగా ఉద్యోగం చేస్తున్నా వారికి ఇంట్లో భార్య ఇబ్బంది కనిపెట్టి సాయం చేయాలని తెలియదు కాని, గాంధీగారి సూక్తులు వర్ణిస్తే సరిపోతుందా?'' ఇవే మాటలు పైకి అనగలిగితే సుజాత ఇంత కష్టపడేదీ కాదు. చెప్పినా అర్థం చేసుకోలేని వారుంటారు. ఇది నా బాధ అని చెప్పలేని సుజాతకి పనిమనిషి రాని రోజున, వచ్చిన రోజునా, నానా యాతనాను.

సుజాత కొత్త పనిమనిషిని పెట్టుకుందామనుకుంది, మళ్ళీ కొత్త పనిమనిషి వస్తే మళ్ళీ కొత్త సమస్యలు వస్తాయి అని, రాని రోజున, పెద్ద మనసు చేసుకుని గిన్నెలు తోముకునేది. ఏదేనా అలవాటు గొప్పది కదా? సుజాతకి గిన్నెలు తోమడం అలవాటై పోయింది. పనిమనిషి పనికి రాకపోవడం అలవాటై పోయింది.

ఇక ఈ ప్రకరణం ఇంతే అనుకుంటున్నారా?

"ఇంకోరకం మనస్తత్వంగలవారున్నారు.

ఓ రిటైరైన పెద్దమనిషి పొద్దున్నే లేచి, "ఏమేవ్ భార్యామణీ! నాకు ఇవేళ బూర్లు తినాలని ఉందే!" అంటూ కుర్చీలో దర్జాగా కూచుని మరీ అరిచాడు.

భర్త వేసిన కేకకి వళ్ళు మండింది.

"ఇవేళ పనిమనిషి రాలేదని ఎలాగా అని నేను బాధపడుతుంటే, ఈయనగారికి బూర్లు తినాలని ఉందిట" అని విసురుగా వచ్చి, "రిటైరై తీరిగ్గా కూచుని, కోరికలు బాగానే ఉన్నాయి. వెళ్ళి పనిమనిషిని పిలుచుకురండి" అంది.

"నేనా, ఈ డిస్ట్రిక్ట్‌కి పెద్ద ఆఫీసర్‌గా చేసి, దర్జాగా బతుకుతూ ఉంటే, పనిమనిషి ఇంటికి నన్ను వెళ్ళమంటావా?" అని బాధపడసాగాడు.

"ఆ రిటైరై పదేళ్ళైనా ఇంకా ఆఫీసరుగా జులుం తగ్గలేదు. మీకు నిజంగా బూర్లు తినాలంటే పనిమనిషిని పిలుచుకురండి."

"అంతేనంటావా? నువ్వు వెళ్ళవే నామాట విని" అన్నాడు.

"ఇదిగో క్రిందటిమాటు పనిమనిషి మానేస్తే నేను వెళ్ళాను. ఈసారి మీరు వెళ్ళండి, ఆ సిలుకు లాల్చీ షోకులూ తీసేసి పాతవేవైనా కట్టుకుని మరీ వెళ్ళండి."

" కిందటి మాటు నీవు అంతపెద్ద జరీ చీర కట్టుకుని వెళ్ళావు కదే?" అని ప్రశ్నించాడు ఆయన.

"అదంతే! ఇంతకీ మీరు వెళ్ళి పిలుచుకుని వస్తేనే బూర్లు తింటారు" అంది భార్యామణి.

"పోనీ ఏంచేస్తా వెళతాను, వసుదేవుడు గాడిద కాళ్ళు పట్టుకున్నాడు కదా?" అంటూ వెళ్ళి పిలుచుకువచ్చాడు.

సరే మొత్తానికి బూర్లు వండి భర్తగారి కోరిక తీర్చింది. తియ్య తియ్యగా తింటూ "ఈరోజు పనిమనిషి రాకపోతే, మీకు బూర్లుండేవికాదు" అంది ఆమె.

"మీ ఆడవాళ్ళకి పనిమనిషి నామ స్మరణే, కదా? మొన్నటికి మొన్న గుడికి వెళ్ళి, మా పనిమనిషి రాలేదంటే మా పనిమనిషి రాలేదు అని చెప్పుకుంటున్నారు నేను విన్నాను."

"మొన్న శ్రావణ శుక్రవారం పేరంటానికి వెళ్ళినప్పుడు కూడా మేమంతా, పనిమనిషి మానేస్తే ఎంత ఇబ్బందో చెప్పుకున్నామండీ బాబూ - మన పనిమనిషి మానేస్తే ఇంటికి వెళ్ళి పిలిచామని గౌరవంగా వస్తుంది. వాళ్ళ పనిమనిషి, వాళ్ళింటికి రావద్దంటుందట, మరి అది ఏమంటారు?"

ఇదండీ సంగతి పనిమనిషి రాకపోతేను.

❄❄❄

(రేడియో 2003)